క్లుప్తంగా

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పార్క్‌లోని సెల్ఫీ పాయింట్ వద్ద కమిషనర్, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నందమూరితారక రామరావు పార్క్‌లో పాత టైర్లకు రంగులు వేసి సెల్ఫీ పాయింట్‌గా తీర్చిద్దిద్దారు. దీంతో ఆ ప్రాంతాన్ని శనివారం కమిషనర్ పరిశీలించారు. ఆయనతో పాటు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ, మెప్మా, సిబ్బందితో కలిసి సెల్ఫీ ఫొటో తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పార్క్‌ల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకొని పట్టణ వాసులకు మరింత ఆకట్టుకునేలా పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా సీఎంఎం జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదల



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

నందవరం : మండల పరిధిలోని గంగవరం గ్రామంలోని తుంగభద్ర నది ఒడ్డున ఏర్పాటు చేసిన గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం నుంచి శనివారం మోటార్ స్విచ్ ఆన్ చేసి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. జీఆర్పీ ప్రాజెక్టులో చోరీ జరిగి నీటి విడుదల ఆలస్యమైందన్నారు. దాదాపు రూ.15 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. నివేదిక సీఎం చంద్రబాబుకు అందజేశామని, త్వరలో నిధులు విడుదలవుతాయని, జీఆర్పీ ప్రాజెక్టులన్నీ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జీఆర్పీ అధికారులు డీఈఈ రవికుమార్, ఏఈ శ్యామ్‌బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన వారికే సదరం సర్టిఫికెట్లు



వైకల్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ మల్లికార్జున

కోసిగి: అర్హత కలిగినవారికి వైకల్యం పర్సంటేజీతో సదరం సర్టిఫికెట్స్ జారీ చేస్తున్నట్లు ఆర్థో పెడిషీయన్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. ఆన్‌లైన్ సదరం క్యాంప్‌కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్య పరీక్షలు చేశారు. ఇందులో కొందరికి శరీర అవయవాలు లోపం ఉండగా.. స్కానింగ్ కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు పంపించారు. మరికొందరికి పరీక్షలు చేసి పంపించారు. నెలరోజుల లోపు ఎక్కడ దరఖాస్తు చేసుకున్నారో అక్కడే సదరం సర్టిఫికెట్ పొందవచ్చని డాక్టర్లు తెలిపారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. కౌతాళం వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెత్త బుట్టల మంజూరు



పెద్దకడబూరు: మండలంలోని గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించడానికి అవసరమైన ప్లాస్టిక్ బుట్టలు మంజూరైనట్లు ఎంపీడీఓ జనార్దన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీ నుంచి మండలంలోని ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్తను సేకరించడానికి అవసరమైన రెండు డస్ట్‌బిన్‌లను సరఫరా చేశారన్నారు. వీటిని త్వరలోనే మండలంలోని 10,140 ఇళ్లకు సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకొని తడి, పొడి చెత్తను వేరువేరుగా వేసి పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

భౌభౌ.. జనాలు బెంబేలు

- గోనెగండ్ల మండలంలో వీధి కుక్కల వీరంగం
- చిన్నా, పెద్దా లేడా లేకుండా ప్రజలపై దాడులు
- నాలుగు నెలల్లో 215 మందికి కుక్కకాటు
- చర్యలు తీసుకోని అధికారులు



గోనెగండ్లలో గుంపు గుంపులుగా ఉన్న వీధి కుక్కలు

గోనెగండ్ల: మొరిగే కుక్క కరవదని అంటారు. అది ఒకప్పటి మాట.. ఇప్పుడు మొరగని కుక్కతో పాటు మొరిగే కుక్క సైతం పిక్కలు పట్టుకుని పీకుతున్నాయి. మండలంలోని గ్రామాల్లో ప్రజలను కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధాన కూడళ్లు, వీధులలో నడుచుకుంటు వెళ్లే వారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంటబడి దాడి చేస్తున్నాయి. రాత్రి పగలు అనే తేడా లేకుండా చిన్న, పెద్ద ఎవరినీ వదిలిపెట్టడంలేదు. క్కుకకాటు బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

నాలుగు నెలల్లో 215 మంది బాధితులు

మండలంలో గడిచిన నాలుగు నెలల్లో కుక్కకాటుకు గురైన వారిని వివరాలను పరిశీలిస్తే.. జూన్‌లో 65 మంది, జూలై 44 మంది, ఆగస్టు 50 మంది, ఈ నెల 20 తేదీన నాటికి 56 మందిని శునకాలు కరిచాయి. నాలుగు నెలలో గోనెగండ్ల ఆస్పత్రిలో 215 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.

వీధి కుక్కలను వదిలేసిన అధికారులు

మండలంలో పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కల సంతతి పెరిగింది. ఈ నేపథ్యంలో రాత్రి అయ్యేసరికి రోడ్డు మీద ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. వీధి కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు నామ మాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. రేబీస్ టీకాలు పెంపుడు కుక్కలకు మాత్రమే వేసి వీధి కుక్కలను గాలికి వదిలేస్తున్నారు. దీంతో తరచూ గ్రామ సింహాల దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

కుక్కలు దాడి చేస్తాయిలా..

కుక్కల దాడి నుంచి తప్పించుకునేందుకు పెద్దలు శతవిధాలా ప్రయత్నిస్తారు. మరి చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. కుక్కల కంటే ఎత్తుగా ఉన్న పెద్దవారికైతే కాలి పిక్కలు పట్టి లాగుతున్నాయి. పిల్లల ఎత్తు శునకాలకు సమాంతరంగా ఉండడంతో ముఖం, మెడ, చెవి, వీపు భాగాల్లో దాడి చేస్తున్నాయి. కాటేసిన శరీర భాగం, గాయం లోతు ఆధారంగా వైద్యులు చికిత్సకు సిఫార్సు చేస్తారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి.
- పెంపుడు కుక్కలకు రేబీస్ సోకకుండా ఏడాదికోసారి విధిగా టీకాలు ఇప్పించాలి.
- వీధి కుక్కలకు కూడా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో టీకాలు ఇప్పించే కార్యక్రమాలు నిర్వహించాలి.
- వీధుల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నందున పిల్లలను ఒంటరిగా బయటకు పంపరాదు.
- కుక్కల నియంత్రణకు స్థానిక సంస్థలు పశు సంవర్థకశాఖతో సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించాలి.
- కుక్క కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన పెంచాలి.

"నిర్లక్ష్యం వద్దు



కుక్కకాటును నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. కరిచిన వెంటనే సమీప ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స చేయించుకుని టీకా వేయించుకోవాలి. కుక్కల బెడద ఉన్న చోట ప్రజలు సాధ్యమైనంతవరకు వాటికి దూరంగా ఉండాలి. కుక్కకాటుకు ఆస్పత్రిలో టీకాలు ఉన్నాయి. ఇప్పటికే కుక్కకాటుకు గురైన వారికి స్థానిక ఆస్పత్రిలో టీకా వేస్తున్నాం.

– డాక్టర్ కార్తీక్, పీహెచ్‌సీ, గోనెగండ్ల

అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగించడం దారుణం

ఆదోని రూరల్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్, ఆదోని డివిజన్ అధ్యక్షుడు బసాపురం యల్లప్ప, నీలకంఠ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు తన స్వహస్తాలతో ఇలాంటి పని చేయడం అంబేడ్కర్‌ను అవమానించడమేనన్నారు. వెంటనే పార్టీ నుంచి ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలన్నారు. రాజ్యాంగ పదవిలో కొనసాగుతూ ఉండి ఎమ్మెల్యే ఇలాంటి పని చేయడం దారుణమన్నారు. ఆయనపై ఎన్‌డీఏ కూటమి అధిష్టానం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. మహిళకు గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన సంజీవమ్మ అనే మహిళను శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు .. సంజీవమ్మ ఎమ్మిగనూరు రోడ్డులోని తిక్కస్వామి దర్గా దగ్గర నడుచుకుంటూ వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

మంత్రి గారూ.. హామీ ఏమైంది



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు బకాయివున్న ఫీజులను చెల్లిస్తామని యువగళం పాద యాత్రలో మంత్రి నారాలోకేష్ ఇచ్చిన హామీ ఏమైనట్లు అని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు రాక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజుల కోసం యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఫీజుల నిధులు ఇవ్వకపోవడంతో విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోయే దుస్థితి నెలకొందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ తాను ఇచ్చిన హామీని నెరవేర్చి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు సైతం ఎన్నికల ప్రచారంలో ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఫీజులను చెల్లించి యాజమాన్యాల నుంచి విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణ నాయుడు, పాలాక్షి, రామ్‌కోటి, సిద్ధు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు



డాక్టర్ సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఎర్రకోటలోని సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మాష్యుటికల్ సైన్సెస్ కళాశాలలో శనివారం ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలలో మందులు, వ్యాక్సిన్‌ల ప్రతికూల ప్రభావాలను గుర్తించడం, వాటిని అంచనా వేయడం, నిరోధించడంపై అవగాహన కల్పించారు. కర్నూలు మెడికల్ కళాశాల ఫార్మకో విజిలెన్స్ అసోసియేట్ డాక్టర్ సతీష్‌కుమార్ మందులు, దుష్ప్రభావాలు ,ఔషధ భద్రతను పర్యవేక్షించడం, ప్రమాదాన్ని తగ్గించడం వంటి విధానాలను వివరించారు. అనంతరం ఆయనను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యు.శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎం వాగేష్, హెచ్‌ఓడీ రంగారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

వలస వెళ్లి.. దొంగగా మారి

- బెంగళూరులో బైక్‌ల చోరీ.. కందుకూరులో విక్రయం
- బైకులు రికవరీ చేసిన బెంగళూరు పోలీసులు



బెంగళూరు పోలీసులు రికవరీ చేసిన బైక్‌లు

కోసిగి: బతుకుదెరువు కోసం కోసిగి మండలం కందుకూరు గ్రామం నుంచి కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వెళ్లిన ఓ వ్యక్తి బైక్‌ల చోరీకి పాల్పడుతూ పట్టుబడ్డాడు. శుక్రవారం కోసిగికి వచ్చిన బెంగళూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు కందుకూరు గ్రామానికి చెందిన హనుమేష్ అనే వ్యక్తి బెంగళూరు నగరంలోని కేఆర్ పురంలో ఉంటున్నాడు. ఉదయం వేళలో బెల్దార్ పనులు చేసుకుని రాత్రిల్లో బైక్‌ల దొంగతనానికి పాల్పడుతున్నాడు. అక్కడ దొంగతనం చేసిన బైక్‌లను సొంత గ్రామం కందుకూరు తీసుకొచ్చి రైతులకు అమ్ముతున్నాడు. బెంగళూరులో బైక్‌లు పోయిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. విచారణలో హనుమేష్‌గా బైక్‌లను దొంగలించినట్లు గుర్తించి అదుపులో తీసుకున్నారు. నిందితుడు 10 బైక్‌లను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అందులో రెండు బైక్‌లు బెంగళూరులోనే ఉండగా మరో 8 బైక్‌లను సొంత గ్రామంలో వివిధ రైతులకు అమ్మకం చేపట్టినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. కందుకూరు గ్రామంలో విచారించి బైక్‌లను రికవరీ చేసినట్లు వెల్లడించారు. బైక్‌లు, నిందితుడిని బెంగళూరుకు తరలించారు.

ఘనంగా ప్రపంచ శాంతి దినోత్సవం



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులతో లయన్స్ క్లబ్, వామ్, అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలో లయన్స్ క్లబ్, అవోపా, వామ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ శాంతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతిఏటా సెప్టెంబర్ 21వ తేదీన ప్రపంచ శాంతి దినోత్సవంగా ప్రపంచమంతా జరుపుకుంటారన్నారు. అనేక సదస్సులు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేసి ప్రపంచంలో శాంతి ప్రాముఖ్యతను తెలియజేస్తారన్నారు. ఈ సందర్భంగా స్థానిక గట్టు ప్రభుత్వ బాలికల పాఠశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్త, సభ్యులు వనపరాజు, వెంకటేశ్వర్లు, రఘు, మమతాశ్రీ, అనూష, పాఠశాల హెచ్ఎం వెంకటరమణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దకడబూరు : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కర్నూలు రైతు శిక్షణా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు జీయం వేదామణి, బనవాసి కృషి విజ్ఞాన్ ప్రోగ్రామ్ కోఆర్డీనేటర్ డాక్టర్ కే.రాఘవేంద్ర చౌదరి సూచించారు. మండల పరిధిలోని కంబదహాళ్ గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి యం.వరప్రసాద్ ఆధ్వర్యంలో ఖరీఫ్ పంటలలో ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పత్తి, మిరుప, వేరుశనగ పంటలలో ప్రస్తుతం చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకుడు రఘువీర, సర్పంచ్ దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎల్‌కే. చిన్నప్ప, మల్లికార్జున, భారత్ గ్యాస్ ప్రొప్రైటర్ పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థులు పట్టణం పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్ వీక్లిఫ్, ఉమాదేవి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వృద్ధురాలు మంగలి రామలింగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. పట్టణానికి చెందిన ప్రభుత్వ చిన్న పిల్లల వైద్యులు బాలాజీ, ఆర్థో వైద్యులు మల్లికార్జున, రోటరీ క్లబ్ సహాయ కార్యదర్శి బీరప్ప, నరసింహులు మృతురాలి కుటుంబానికి శనివారం చేయూత నందించారు. ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి మృతురాలి అంత్యక్రియలకు రూ.5వేలు, ఇతర ఖర్చులకు మరో రూ.5వేలను ఆమె కోడలు పార్వతమ్మకు అందజేశారు.

దేవరగట్టును సందర్శించిన సబ్‌కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్

హొళగుంద: బన్ని ఉత్సవాల విశిష్టత, ఉత్సవాలు జరిగే విధానం తదితర వాటి గురించి తెలుసుకునేందుకు ఆదోని సబ్ కలెక్టర్ భరద్వజ శనివారం దేవరగట్టులో పర్యటించారు. మల్లప్ప గుడిలోని సింహాసన కట్టను దర్శించుకున్నారు. అనంతరం తేరుబజారు, ఆస్పరి మఠం, చెరువు గట్టు తదితర ప్రాంతాల్లో కలియ తిరిగి ఉత్సవాలు జరిగే విధానం గురించి ఆలయ పూజారులు, ఉత్సవ నిర్వాహకులు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల పెద్దలను అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ స్థలం, తాగునీరు, హెల్త్ క్యాంప్, విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు, బారికేడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర చర్యల గురించి తహసీల్దారు ప్రసాద్‌రాజును అడిగి తెలుసుకున్నారు.

వికసిత్ ఆంధ్రపై సమీక్ష..

అనంతరం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో మండల ప్రత్యేకధికారి నాగేశ్వరరావు, ఎంపీడీఓ సుహాసినమ్మతో కలిసి ఆయా శాఖల అధికారులతో వికసిత్ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హొళగుందలోని ఉన్న తమ పట్టా భూములు రెవెన్యూ రికార్డులో మిగులు భూములుగా చూపిస్తున్నారని వాటని సరి చేయాలని రైతు పంపాపతి ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

కోసిగి: విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ విమర్శించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లలో విద్య రంగానికి 40 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్య రంగానికి నిధులు కేటాయించకుండా ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రపన్నుతున్నారని మండి పడ్డారు. కార్పొరేట్ విద్యను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అంజి, వీరేష్, విజయ్, బడేసాబ్, నాయుడు, అశోక్, దివాకర్ తదితరులు ఉన్నారు.

దశమి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సీఐ గంగాధర్

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో వెలసిన శ్రీశ్రీశ్రీ ఆది చింతలాముని రంగడు, నల్లారెడ్డి స్వాముల వారి దశమి మహోత్సవ వేడుకలు అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ గంగాధర్ సూచించారు. ఆదివారం నుంచి వేడుకలు ప్రారంభంకానున్నాయి. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశమి మహోత్సవానికి వివిధ పట్టణాలు, గ్రామాల నుంచి వేలాది మంది పాల్గొంటున్నారు. డీఎస్పీ ఉపేంద్ర బాబు ఆధ్వర్యంలో 2 సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 68 మంది పోలీసులు, మహిళ పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చూసుకుంటామని తెలిపారు. మహోత్సవాల్లో బాల్ గేమ్స్, ఛాన్స్ గేమ్స్, పేకాట నిర్వహించినా, ఆడినా, మద్యం సేవించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థినులకు పరామర్శ



ఆసుపత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న బీసీ జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి వెంకటలక్ష్మి

ఆదోని సెంట్రల్: బీసీ బాలికల జూనియర్ వసతి గృహంలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను బీసీ జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి వెంకటలక్ష్మి శనివారం పరామర్శించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని, అస్వస్థతకు గురైన కారణాలను తెలుసుకున్నారు. ఆసుపత్రి సుపరింటెండెంట్ శ్రీనివాస నాయక్‌తో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి ఫుడ్ పాయిజన్, మరే ఇతర కారణాలు కావని తెలిపారు. మొదటి రోజు అస్వస్థకు గురైన ఇందు అనే అమ్మాయి బీపీ కంట్రోల్ కాకపోవడంతో కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేయగా.. అక్కడి డాక్టర్లు వైద్య పరీక్షలను నిర్వహించి ఆమెకు హార్ట్ అపరేషన్ అయ్యిందని, స్టంట్స్ కూడా ఉన్నట్లు తెలిపారన్నారు. తలలో కూడా నరాలు క్లాట్ అయ్యాయని, ఆపరేషన్ చేయాలని చెప్పారన్నారు. అయితే మరుసటి రోజు అస్వస్థతకు గురైన విద్యార్థినులు ఇందుకు మంచి ఫ్రెండ్స్ అని, దీంతో కొంత కలవరం చెందారని తెలిపారు. వసతి గృహాన్ని రేకుల షెడ్డులో నడపడం లేదు. మూడంతస్తుల బిల్డింగ్ బాడుగకు తీసుకుని నడుపుతున్నామని, ప్రతి రూమ్‌కు అటాచ్ బాత్ రూమ్స్ ఉన్నాయన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు సౌకర్యాలు లేవు

ఆదోని రూరల్: విద్యార్థినులను పరామర్శించడానికి వచ్చిన జిల్లా సంక్షేమ అధికారిణి వెంకటలక్ష్మిని పీడీఎస్ఓ నాయకులు కలిసి పలు సమస్యలపై మాట్లాడారు. హాస్టల్‌లో విద్యార్థినులకు సరైన సౌకర్యాలు లేవని, మెనూ ప్రకారం ఆహారం సరిగా అందించడం లేదన్నారు. దీంతో విద్యార్థినులు అనారోగ్యాల పాలవుతున్నారని చెప్పారు. అలాగే నీటి సమస్య, శుభ్రత లేని బియ్యం వినియోగిస్తున్నారన్నారు. పీడీఎస్ఓ డివిజన్ సెక్రటరీ శివ, నాయకులు రాజేష్, వీరేష్ ఉన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ

ఆదోని అర్బన్: ఆదోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బీజేపీ ఆదోని అసెంబ్లీ కో–కన్వీనర్ నారాజుగౌడ్ శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు విషయంలో ఎమ్మెల్యే అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోవిందరావు, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధన కార్యదర్శి నాగార్జున, నగర ప్రధాన కార్యదర్శి దేవేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి



గురుజాడకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

కౌతాళం: వాడుకభాషకు అడుగుజాడ గురుజాడ అప్పారావు అని, తెలుగు సాహిత్యంలో వాడుక భాషకు పట్టం కట్టిన విశిష్ట రచయిత గురుజాడ అప్పారావు అని తెలుగు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుడు శిరీష, సునీల్ అన్నారు. గురుజాడ అప్పారావు జయంతి వేడుకలను స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల హెచ్ఎం జ్ఞానేశ్వరి, పాఠశాల సెక్రటరీ మైనుద్దీన్, ఉపాధ్యాయ బృందం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గురజాడ జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమాజంలో అంటరానితనం రూపుమాపడంలోను ఆయన కృషి ఎనలేనిదన్నారు. ఉపాధ్యాయులు భీమష్, ఈరన్న, విరుపాక్షి, శీను, సబిహా, భారతి, పుష్ప, రాజు, ముంతాజ్‌లు పాల్గొన్నారు.



ఆదోనిలో గురజాడ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో అభ్యుదయకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 162వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలిమ్ సిద్దిఖీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ మాట్లాడుతూ సంఘంలో సమాజంలో నెలకున్న సాంఘిక దురాచాలను ఎత్తిచూపుతూ తన సాహిత్యం ద్వారా ప్రజలను చైతన్య పరిచిన మహాకవి అని కొనియాడారు. కార్యక్రమంలో అరసం నాయకులు సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు రామయ్య, ఉపాధ్యాయుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం

ఆదోని సెంట్రల్: గర్భిణులు, బాలింతలు, చంటి పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పవతి తెలిపారు. శనివారం ధణాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రతలు సూచనలను వివరించారు.

ప్లాటినం జూబ్లీ వేడుకలకు రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం ఇస్తున్న ఎంజీ బ్రదర్స్ మాచాని జగదీష్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల పూర్వ విద్యార్థుల మహా ఆత్మీయ సమ్మేళనం (ప్లాటినం జూబ్లీ) వేడుకల నిర్వహణకు గాను ఎంజీ బ్రదర్స్ మాచాని జగదీష్ రూ.లక్ష విరాళాన్ని నిర్వాహకులకు శనివారం అందజేశారు. ఈనెల 29న పట్టణంలోని పాఠశాల, కళాశాల ఆవరణలో 75 ఏళ్ల తరువాత నిర్వహించే పూర్వ విద్యార్థుల ఆత్మీయ మహాసమ్మేళనానికి నాటి నుంచి చదివిన పూర్వ విద్యార్థులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ప్లాటినం జూబ్లీ వేడుకల నిర్వాహకులు మాచాని శివశంకర్, బైలుప్పుల షఫీవుల్లా, కేస్పీ శివన్న, మాచానివెంకటేష్, ఛాయ రాము, నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.